

సాధారణ వర్షపాతమే..

- జిల్లాలో జూన్‌లో 297.6 మిల్లీమీటర్లు నమోదు
- భారీ వర్షాలు లేక నిండని ప్రాజెక్టులు
- వెలవెల బోతున్న చెరువులు, కుంటలు



సిర్పూర్(టి)లో కురుస్తున్న వర్షం (ఫైల్)



నీరు లేక వెలవెలబోతున్న దహెగాం మండలంలోని పీపీరావ్ ప్రాజెక్టు

ఆసిఫాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సీజన్ ప్రారంభమై నెలరోజులు గడిచిపోయినా జిల్లాలో ఇంకా సాధారణ వర్షపాతమే కురిసింది. ఈ ఏడు మే చివరి వారంలో ముందస్తు వర్షాలు మురి ఎంచినా అతర్వాత ముఖం చాటేయడంతో పంటల సాగు కొంత ఆలస్యంగానే ప్రారంభమైంది. మోస్తరు వర్షాలకు రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. గ్రామాల్లో ఉన్నమట్టి రోడ్లన్నీ గుంతలుగా మారి వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నా రు. ప్రస్తుతం జిల్లాలో మెట్ట పంటల సాగు ప్రక్రియ కొనసాగు తోంది. జూన్ నెలలో కురిసిన అడపాదడపా వర్షాలకు అన్నదాతలు పంటలను సాగు చేశారు. మెట్ట పంటల సాగుకు అనుకూలమైన వాతావరణం ఉండడంతో అన్నదాతల్లో కొంత హర్షం వ్యక్తమవుతుంది. జిల్లాలో వర్షాధారంగా పత్తి కంది, పెసర, జొన్న, మొక్కజొన్న పంటలను ఎక్కువగా సాగు చేస్తారు. జూన్ 1 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 264.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావల్సి ఉంది. కాగా 297.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా వాంకిడి మండలంలో 415.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా తిర్యాణి 192.7 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. దీంతో అన్నదాతలు జూలైలో సంవృద్ధిగా వర్షాలు కురుస్తాయని భారీగా ఆశలు పెట్టుకున్నారు.

● జిల్లాలో 4,45,049 ఎకరాల్లో పంటలు..

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 4,45,049 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవు తాయని అధికారులు అంచనాలు వేశారు. వీటిలో పత్తి 3,35,363 ఎకరాలు, వరి పంట 56,861 ఎకరాలు, కంది పంట 30,430 ఎకరాలు, అలాగే ఇతర పంటలైన మొక్కజొన్న, జొన్న, పెసర, మినుములు, సోయాబీన్, మిరప, వేరుశెనగ, ఆముదాలు, నువ్వులు 22,395 ఎకరాల్లో సాగు కానున్నాయి. జిల్లాలో ఎక్కువగా రైతులు వానాకాలం సీజన్‌లో వర్షాధార పంటలనే సాగు చేస్తారు. ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న వర్షాలు మెట్ట పంటలకు అనుకూంగా ఉన్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పత్తి, కంది, జొన్న, మొక్కజొన్న పంటలకు కురుస్తున్న వర్షాలతో మేలు కలుగుతుందని రైతులు చెబుతున్నారు. కానీ 56,861 ఎకరాల్లో సాగు చేసే వరి పంటకు సరిపడా నీరు అందుబాటులో లేక పోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

● అంతంత మాత్రంగానే నీటి నిల్వలు

వానాకాలం సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి భారీ వర్షాలు కురువక పోవడంతో చెరువు లు, కుంటలు, ప్రాజెక్టుల్లో అంతంత మాత్రంగానే నీటినిల్వలు కనిపిస్తున్నాయి. కుమరంభీం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 243.00 మీటర్లుకు గారూ ప్రస్తుతం 237.50 మీటర్లకు చేరుకుంది. వట్టివాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 239.500 మీటర్లు కాగా, ప్రస్తుతం 235.600 మీటర్లకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు అంతత మాత్రంగానే ఉన్నాయి. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

● ఆరు మండలాల్లో మాత్రమే..

జిల్లాలో 15 మండలాల పరిధిలో ఇప్పటివరకు 6 మండలాలలో అధిక వర్షపాతం నమోద అయింది. మిగితా 9 మండలాలల్లో సాధారణ వర్షపాతం నమో దైంది. మండలాల వారీగా పరిశీలిస్తే లింగాపూర్, ఆసిపాబాద్, రెబ్బెన, కెరమెరి, వాంకిడి, కాగజ్‌నగర్ మండలాల్లో అధిక వర్షపాతం నయోదైంది. జైనూర్, సిర్పూర్(యు), తిర్యాణి, సిర్పూర్(టి), కౌటాల, చిం తలమానేపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట. దహేగాం మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. తొమ్మి ది మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కావడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో బుధవారం జిల్లా మాధ్యమిక అధికారి కళ్యాణి, జిల్లా గిరిజన సంక్షేమాధికారిణి రమాదేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, పంచాయతీ రాజ్ ఇంజనీర్ కృష్ణలతో కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలు, పాఠశాలలు, వసతి గృహాలు, గురకులాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో వసతుల కల్పన, అదనపు గదుల నిర్మాణాలపై ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థలు, సంక్షేమ వసతి గృహాలలో మౌలిక వసతుల కల్పన, తాగునీరు, మూత్రశాలలల నిర్మాణం, భవనాల మరమ్మతులు, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, కంప్యూటర్లు, సీసీ కెమెరాల ఏర్పాటు, ఇతర పనులకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అస్పిరేషనల్ బ్లాక్‌లో భాగంగా తిర్యాణి మండలంలో రహ దారులు, పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, అంగన్‌వాడీ కేంద్రాలలో తాగునీరు, మూత్రశాలల నిర్మాణాలు, విద్యుదీకరణ, భవనా ల పెయింటింగ్ పనులు త్వరగా చేపట్టాలని తెలిపారు. గతంలో ప్రారంభించిన పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి, ప్రిన్సిపాళ్లు పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

వాంకిడి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బహూళార్థక సాధక కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. లింబుగూడ గ్రామంలోని బహూళార్థక సాధక కేంద్రాన్ని బుధవారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాతో కలిసి సందర్శించారు. వారి వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

ఎగువ నుంచి వరద.. ప్రాణహిత పరవళ్లు



తుమ్మిడిహెట్టి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాణహిత

కౌటాల/కోటపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు వరద రావడంతో ప్రాణహిత పరవళ్లు తొక్కుతోంది. ఈ సంవత్సరం మొదటి సారి ప్రాణహిత నది నీరు పుష్కర ఘాట్ మెట్లను తాకింది. ఇంకాన నది ప్రవాహం పెరుగుతుండడంతో నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు, రెవెన్యూ శాఖల అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎవరు కూడా చేపల వేటకు వెళ్లరాదని సూచిస్తున్నారు. మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ఒకే సారి నది ప్రవాహం పెరగడంతో తుమ్మిహెట్టి వద్ద గల పుష్కరఘాట్ వద్ద ప్రాణహిత నదిని సందర్శించేందుకు సందర్శకులు తరలివస్తున్నారు. కోటపల్లి వద్ద సైతం ప్రాణహిత ఉధృతంగా ప్రవహిస్తోంది.

మెరుగైన విద్య అందించాలి

వాంకిడి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల పాఠశాల, ప్రభుత్వ వైద్యశాల, లింబోగూడ టీడబ్ల్యూపీఎస్ పాఠశాల, లింబుగూడ మల్టీ పర్పస్ సెంటర్‌ను సందర్శించారు. వంటలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీటీడీవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

కాగజ్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పనులను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో సిందం శ్రీనివాస్, బాల్కశ్యాం, అరుణ్‌లోయా, గజ్జల లక్ష్మణ్, శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే

కౌటాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో బుధవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మొక్కలను నాటారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య, తహసీల్దార్ ప్రమోద్, ఎంపీడీవో రమేష్, ఎంఈవో హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

గుంతలో దిగబడిన ఆటో

సిర్పూర్(టి), జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డుపై బుధవారం ప్రయాణికులతో వెళు న్న ఒక ఆటో గుంతలో దిగబడింది. అప్రమత్తమైన డ్రైవర్ ఆటోను నిలిచి వేయడంతో ప్రమాదం తప్పినట్లయింది.



దిగబడిన ఆటో

తుమ్మిడిహెట్టి వద్ద నీరు లేదనడం సరికాదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

కౌటాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే తగినంత నీరు లేదని చెప్పడం సరికాదని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నది ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ఉధృతంగా ప్రవహించి పుష్కరఘాట్‌లకు తగలడంతో బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటా 200 టీఎంసీలకు తక్కువ కాకుండా నీటి లభ్యత ఉన్నా గతంలో కేసీఆర్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు దోచి పెట్టడానికే కాళేశ్వరం వద్ద మేడిగడ్డ బ్యారేజీ నిర్మించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు పునరుద్ధరిస్తామని తెలిపారని అన్నారు. ఇప్పటి వరకు డీపీఆర్ కూడా సిద్ధం చేయలేదని చెప్పారు. ఈ రోజు సాగునీటి శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి ప్రజాభవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్నారని, తుమ్మిడిహెట్టి వద్ద ఉన్న నీటి ఉధృతిని వారికి తెలియజే యడానికి ఈ ప్రాంతాన్ని సందర్శించి వారికి లైవ్ వీడియో ద్వారా సందేశాన్ని పంపించానని తెలిపారు. వెంటనే సమగ్ర రిపోర్టు తయారు చేసి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును నిర్మి స్తే ప్రాణహిత నుంచి చేవెళ్ల వరకు నీటిని మళ్లించవచ్చని తెలిపారు. ఎల్లంపల్లి వరకు కేవలం గ్రావిటీ ద్వారా నీటిని తరలించి ఎల్లంపల్లి నుంచి ఇప్పుడున్న లిఫ్ట్‌లను ఉప యోగించుకుంటే సరిపోతుందని, తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం వ చ్చే ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, విజయ్, మోతిరాం, సాయి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పహాణీలు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జైనూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న ఎస్సీ కులాల వారికి బ్యాంక్ రుణాల కోసం పహాణీ పత్రాలు మంజూరు చేయాలని అంబేద్కర్, అన్నాబావు సాఠె సంఘం నాయకులు కాంబ్లే బాబా సాహేబ్, మవాలె దత్త ఆధ్వర్యంలో నాయకులు బుధవారం తహసీల్దార్ ఆడ బీర్షావ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తాము 50 ఏళ్లుగా ఏజెన్సీలో పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నామని చెప్పారు. పహాణీ పత్రాలు జారీ చేయక పోవడంతో బ్యాంక్ రుణాలు పొందలేక పోతు న్నామని చెప్పారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోటంబే శ్రీహరి, దుదానె సుగ్రీవ్, హన్మంత్‌రావ్, భండారె గౌతం పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బెజ్జూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని డీఎస్పీ రామానుజం అన్నారు. పోలీసు స్టేషన్ ఆవరణలో బుధవారం మండల స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు.

ఎంపీటీసీ స్థానాన్ని కొనసాగించాలి

పెంచికలపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పెంచికలపేట ఎంపీటీసీ స్థానం కొనసాగించాలని బుధవారం గ్రామ ప్రజలు ఎంపీడీవో ఆల్బర్ట్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉస్మాన్, శేఖర్, రాజ్ మహ్మద్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ గణపతి షబ్బీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంత్రి సీతక్క జన్మదిన వేడు కలను పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ సీనియర్ నాయకుడు మేస్రాం అంబాజీ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం నిర్వహించే బుద్ధుడితో నా ప్రయాణం అనే తెలుగు నాటిక పోస్టర్లను బుధవారం బౌద్ధ మహాసభ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మౌల్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేకాధికారి, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ అన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో మాట్లాడారు.

జైనూర్/లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జైనూర్, లింగాపూర్ ఎంపీడీవోలు సుధాకర్‌రెడ్డి, రాంచందర్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరాల్లో బుధవారం ఏర్పాటు చేసిన వేర్వేరు సమావేశాల్లో వారు మాట్లాడారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): కర్జెల్లి-గూడెం ప్రధాన రహదారి మరమ్మతులు ఎమ్మెల్యే హరీష్‌బాబు చేపట్టకుంటనే తామే చేపడుతామని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అనుచరులు అన్నారు. స్థానికంగా పలువురు మాట్లాడుతూ ఎమ్మెల్యే పనులు పూర్తి చేయాలని కోరారు.

సమ్మె విజయవంతం



కాగజ్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ సంఘాల నాయకులు



ఆసిఫాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్/రెబ్బెన/తిర్యాణి/కెరమెరి/బెజ్జూరు/దహెగాం/కౌటాల/సిర్పూర్(టి)/జైనూర్/చింతలమానేపల్లి/సిర్పూర్(యు), జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, జీవో 49ని రద్దు చేయాలని, పోడు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దేశ వ్యాప్త సమ్మె జిల్లాలో విజయవంతమైంది. జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున కార్మికులు కదిలి వచ్చి ర్యాలీ నిర్వహించి స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద మహాధర్నా చేపట్టారు. సమ్మెలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దివాకర్, ఉపేందర్, సీఐటీయూ నాయకుడు రాజేందర్‌లు, శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో కార్మికులు నిరసనకు హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు బాలకిషన్, కమలాకర్, అశోక్, శంకర్, చిరంజీవి, సుధాకర్, దినకర్, మాలశ్రీ, కార్తీక్, రాజు, శంకర్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు. కాగజ్‌నగర్ పట్టణం, మండలంలో సీఐటీయూ, సీపీఎం, ఐఎన్‌టీయూసీ, టీఎస్ యూటీఎఫ్, అంగన్‌వాడీ, మున్సిపాల్టీలోని వివిధ సంఘాలతో పాటు ఇతర అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు, సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ట్రాన్స్ కో కార్యాలయంలో టీజీపీఈ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆకా కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, కూశన్న రాజన్న, ఆర్.త్రివేణి, ముంజం ఆనంద్, జేఏసీ నాయకులు విలాస్, ఎమ్మాజీ సతీష్, ఇర్ఫాన్ అహ్మద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు. రెబ్బెన ఎంపీడీవో కార్యాలయం ఎదుట వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో ఏఐటీయూసీ రెబ్బెన మండల అధ్యక్షుడు రాచకొండ రమేశ్ రత్నం దేవాజీ, వెంకటేష్, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రసిడెంట్ పేరం శ్రీనివాస్, డిప్యూటి జనరల్ సెక్రటరి సంగెం ప్రకాష్, ఏరియాకార్యదర్శి బూర శ్రీనివాస్, గంగు రాంమోహన్ పాల్గొన్నారు.కెరమెరి మండల కేంద్రంలో కార్మికులు, ఆయా సంఘా నాయకులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌రావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. తిర్యాణిలో కార్మికులు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు టీకానంద్, తదితరులు పాల్గొన్నారు. బెజ్జూరు మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. వెంటనే కార్మిక వ్యతిరేక కోర్డులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దహెగాం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ శాఖల కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐకేపీ, మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు. కౌటాల మండల కేంద్రంలో కార్మికులు, నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో శ్రీనివాస్, నగేష్, మోరేశ్వర్, శారద, జీజాబాయి తదితరులు పాల్గొన్నారు. సిర్పూర్(టి) మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ, ఆశా, కార్యకర్తలు పాల్గొన్నారు. సిర్పూర్(యు) మండల కేంద్రంలో కార్మిక సంఘాల నాయకులు రహదారిపై బైఠాయించారు. కార్యక్రమంలో గోడం సేద్మరాం గంగారాం తదితరులు పాల్గొన్నారు. జైనూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఐకేపీ వీవోఏలు, మధ్యాహ్న భోజనం, పంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. కేంద్ర విధానాలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు. చింతలమానేపల్లి మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో విలాస్, శ్రీలత, మంగళ, స్వప్న, హంస, రవి తదితరులు పాల్గొన్నారు.



సిర్పూర్(యు)లో రోడ్డుపై బైఠాయించిన కార్మికులు



బెజ్జూరులో రాస్తారోకో చేస్తున్న కార్మికులు, నాయకులు



సిర్పూర్(టి)లో నిరసన తెలియజేస్తున్న కార్మికులు

గుడుంబా పట్టివేత

వేమనపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీల్వాయి గ్రామంలోని నర్సరీ వద్ద బుధవారం అక్రమంగా తరలిస్తున్న గుడుంబాను పట్టుకున్నట్లు నీల్వాయి ఎస్‌ఐ శ్యామ్ పటేల్ తెలిపారు. ఆయన కథనం మేరకు..కోటపల్లి మండలం సర్వాయిపేట గ్రామం నుంచి గుడుంబా రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు మాటు వేశారు. దంపతులు బైక్‌పై గుడుంబా నీల్వాయికి వస్తుండగా వారిని ఆపి తనిఖీ చేశారు. బ్యాగులో 40 లీటర్ల గుడుంబా ప్యాకెట్లు లభించాయి. సర్వాయిపేటకు చెందిన జరుపుల రాజేష్ అతని భార్య కల్పనలు సంవత్సరం నుంచి వీరు గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్నారు. వీరి వద్ద నుంచి 40 లీటర్ల గుడుంబా, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దర్ని తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. మంగళవారం రాత్రి కోటపల్లి మండలం అల్గామ గ్రామానికి చెందిన కుమ్మరి సాయికుమార్, కుమ్మరి శివతేజలు గుడుంబా తరలిస్తుండగా మండ లంలోని ముల్కలపేట గ్రామం వద్ద పోలీసులు పట్టుకున్నారు. నిందితులను విచారించగా ఆల్గామకు చెందిన నమ్మయ్య అనే వ్యక్తి గుడుంబా తయారు చేసి ముల్కల పేట గ్రామం లోని ముత్తక్కకు ఇవ్వాలని చెప్పగా తీసుకువచ్చామని ఒప్పకున్నారు. నింది తుల నుంచి 40 లీటర్ల గుడుంబా, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులపై కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


మహేందర్ (ఫైల్)

దండేపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన ఓ యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై తహసీనోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వందూర్‌గూడ గ్రామానికి చెందిన కోవ మహేందర్(19) అనే యువకుడు కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి అలవాటు పడ్డాడు. అప్పుడప్పుడు కడుపునొప్పితో ఇబ్బంది పడుతు న్నాడు. కుటుంబసభ్యులు పలు మార్లు స్థానిక ఆర్ఎంపీకి చూపించారు. ఈనె ల 5న కడుపు నొప్పి అధికం కావడంతో భరించలేక పురుగుల మందు తాగి అతడి స్నేహితుడికి ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే అతడిని లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి రిఫెర్ చేశారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. మహేందర్ అన్న లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తాహసీనోద్దీన్ తెలిపారు.

బాధితురాలికి పరామర్శ

జైనూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుతున్న ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన గుస్సాడీ టీం లీడర్ కనక సుదర్శన్ కుమార్తె అమూల్యను బుధవారం టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పరామర్శించారు. అమూల్యకు మెరుగైన వైద్యం అందించాలని ఆత్రం సుగుణక్క డాక్టర్లను కోరారు. ఆమె వెంట మార్లవాయి మాజీ సర్పంచ్ కనక ప్రతిభ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ కష్టాలు

- మండల కేంద్రంలో పెరిగిన రద్దీ
- వాహనదారులు, ప్రజలకు తప్పని ఇక్కట్లు


బెజ్జూరులో ఇబ్బందికరంగా వెళుతున్న వాహనాలు

బెజ్జూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. నిత్యం రద్దీగా ఉండే మండల కేంద్రంలోని ప్రధాన రహదారి మీదుగా పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల విస్తరణ చేపట్టక పోవడంతో ఒకేసారి ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఎటూ వెళ్లలేని పరిస్థితులు నెలకొనడంతో గంటల తరబడి వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

ప్రధాన రోడ్డుకు ఇరువైపులా చిరువ్యాపారులు వ్యాపారం కోసం రోడ్లపైనే దుకాణాలు ఏర్పాటు చేయడంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. మండల కేంద్రంలో నిత్యం రద్దీ పెరిగి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. దీనికితోడు వాహనదారులు ఆటోలు, ద్విచక్రవాహనాలను రోడ్డుకు ఇరువైపులా ఇష్టారాజ్యంగా నిలుపుతుండడంతో వచ్చిపోయే వాహనాలకు ఆటంకం ఏర్పడి వెళ్లలేని పరిస్థితి ఉంది. మండల కేంద్రంలోని రోడ్డును గతంలో విస్తరణ చేపట్టినా వాహనదారులు ఎక్కడ పడితే అక్కడే నిలిపివేస్తుండడంతో సమస్య ఎదురవుతోంది.


బెజ్జూరులో రోడ్డుపైనే నిలిచిన వాహనాలు

వారసంత రోజున..

మండల కేంద్రంలో ప్రతీ ఆదివారం నిర్వహించే వారసంత రోజున ట్రాఫిక్ కష్టాలు అన్ని ఇన్ని కావు. వారసంతకు వచ్చే వ్యాపారులు రోడ్డుకు ఇరువైపులా ప్రధాన రోడ్డుపైనే విక్రయాలు జరుతున్నారు. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు వెళ్లడం కష్టతరంగా మారింది. సంత రోజున రద్దీ అధికంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంతకు వాహనాలను సైతం ఇష్టారాజ్యంగా నిలిపివేస్తుండడంతో సమస్య మరింత జఠిలమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుపైనే వీధి వ్యాపారాలు

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

జైపూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దుబ్బపల్లి గ్రామ శివారులో బుధవారం కోడి పందేల స్థావరంపై దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు జైపూర్ ఎస్‌ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం దుబ్బపల్లి శివారులో కోడి పందేలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో అక్కడకు వెళ్లి దాడి చేశామన్నారు. నస్పూర్‌కు చెందిన ఒకరు, లక్షెట్టిపేట, శ్రీరాంపూర్ తీగల్‌పహాడ్‌కు చెందిన ఇద్దరిని పట్టుకున్నామన్నారు. ఇందారం, టేకుమట్ల, గోదావరిఖని, అరుణక్కనగర్‌కు చెందిన కొందరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఒక కోడి, 31 కోడి కత్తులు, రూ. 3,840 నగదు, మూడు సెల్‌ఫోన్‌లు, ఏడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

వాంకిడి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి రాథోడ్ బిక్కు అన్నారు. రైతు వేదికలో బుధవారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు ఎరువులు సకాలంలో అందించి ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. టోకెన్ ద్వారా ఎరువుల పంపిణీ చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఏవో గోపికాంత్‌ను ఆదేశించారు. వర్షాకాలం మొదలైనందున వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ముందస్తు జాగ్రత్తలపై గ్రామాల్లో అవగాహన కల్పించాని వైద్యాధికారి వినయ్‌ని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు అన్నింటికి మార్క్ ఔట్ ఇచ్చి నిర్మాణ దశలోకి తీసుకు రావాలన్నారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ప్రవీన్‌కుమార్, ఏవో గోపికాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శైలేందర్, హౌసింగ్ ఏఈ నాగరాజు, ఏపీవో శ్రావణ్‌కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల బారులు


ఎరువుల కోసం వచ్చిన రైతులు, కుటుంబ సభ్యులు

బెజ్జూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం రైతులు యూరియా కోసం బారులు తీరారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా నికి 888 యూరియా బస్తాలు బుధవా రం రావడంతో రైతులు ఒక్కసారిగా యూరియా కోసం సహకార సంఘానికి తరలివచ్చారు. వ్యవసాయాధికారి నాగరాజు ఆధ్వర్యంలో రైతులకు ఎకరానికి రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు.

అధికారులు సమాచారం సిద్ధం చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో త్వరలో కేంద్రమంత్రి పర్యటన ఉన్నందున అధికారులు తమ శాఖల పూర్తి సమాచారం సిద్ధం చేయాలని కలెక్ట ర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం డేవిడ్‌లతో కలిసి త్వరలో జిల్లాలో పర్యటించనున్న కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారులు, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి హర్ష మల్హోత్ర కార్యక్రమంపై బుధ వారం అధికారులతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టే పథకాల అమలుపై సమీక్షించనున్నారని చెప్పారు. అస్పిరేషనల్ బ్లాక్‌లో భాగంగా ప్రధానమంత్రి జన్‌మన్, ప్రధాన మంత్రి జుగా పథకం అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. కేంద్ర మంత్రి పర్యటన రెండు రోజుల పాటు జిల్లాలో ఉంటుం దని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలపై క్షేత్రస్థాయిలో పర్యటనలు ఉంటాయన్నారు. అధికారులు నివేదికలను జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి అందించాలని సూచించారు. అనంతరం అధికారులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ ఎంప్లాయి మెంట్ ఎక్స్ఛేంజ్ తెలంగాణ గోడ ప్రతులను అవిష్కరించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ హెచ్‌ఎం మాకొద్దు..

- రోడ్డెక్కిన విద్యార్థినులు
- అనుచితంగా ప్రవర్తిస్తున్నాడంటూ ఫిర్యాదు
- విచారణ జరిపిన అధికారులు.. హెచ్‌ఎం తొలగింపు


రోడ్డుపై బైఠాయించిన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

కోటపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కోటపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు బుధవారం రోడ్డెక్కారు. ఉదయం 7 గంటలకే వసతి గృహం గోడ దూకిన 9, 10వ తరగతులకు చెందిన విద్యార్థినులు చెన్నూరు-కోటపల్లి రహదారి పక్కన ఆశ్రమ పాఠశాలకు వెళ్లే దారిలో బైఠాయించారు. హెచ్‌ఎం అశోక్ వద్దంటూ సమస్య పరిష్కారానికి ఐటీడీఏ పీవో రావాలంటూ నినాదాలు చేశారు. సుమారు 2 గంటల పాటు రోడ్డుపైనే ఆందోళన చేపట్టారు. తమకున్న సమస్యలు ఎవరికీ చెప్పమని, కేవలం ఐటీడీఏ పీవోకు మాత్రమే చెప్తామని, పీవో వెంటనే రావాలని పట్టుబట్టారు. మీడియాతో మాట్లాడిన విద్యార్థినులు హెచ్‌ఎం అశోక్ తమతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, షేక్ హ్యాండ్ ఇచ్చి చేతులు నొక్కుతున్నాడని, అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని, ఇంతకన్నా ఎక్కువ చెప్పలేమన్నారు. ఆందోళన కొనసాగుతుండగా సంఘటన స్థలానికి ఎస్‌ఐ రాజేందర్, ఏటీడీవో పురుషోత్తం చేరుకుని విద్యార్థునులతో మాట్లాడారు. ఓ వైపు వర్షం కురుస్తున్నా విద్యార్థినులు కదలకపోగా ఐటీడీఏ ఏపీవో దామోదర స్వామి విద్యార్థినులతో ఫోన్‌లో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో అక్కడ నుంచి పాఠశాలకు తిరిగి వెళ్లారు. అనంతరం డీటీడీవో, ఏటీడీవోలు సుమారు 3 గంటల పాటు విచారణ చేపట్టారు. మరో వైపు చెన్నూరు రూరల్ సీఐ బన్సీలాల్, ఎస్‌ఐ రాజేందర్‌లు సైతం సమస్యలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఎవర్ని పాఠశాలలోకి రానివ్వకుండా విచారణ జరిపిన అధికారులు విద్యార్థినుల నుంచి రాతపూర్వకంగా ఫిర్యాదు తీసుకున్నారు. విచా రణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని డీటీడీవో జనార్దన్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెచ్‌ఎం అశోక్‌ను విధుల నుంచి తప్పిస్తూ పాఠశాలలోని సీనియర్ ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించామని, ఇవి మౌఖిక ఆదేశాలు మాత్రమేనని, ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చేంత వరకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించామని డీటీడీవో పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న కుటుంబ సభ్యులు

రెబ్బెన, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం పులికుంటకు చెందిన దుర్గ మారుతి కుటుంబ సభ్యులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు బుధవారం సాయంత్రం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ నెల 3న దుర్గం మారుతి ఇసుక ట్రాక్టర్ నడుపుతూమండల కేంద్రానికి సమీపంలో దేవలగూడ వద్ద డివైడర్‌ను ఢీ నడంతో తీవ్ర గయాలయ్యాయి. కుటుంబీకులు బెల్లంపల్లి ఆరోగ్య కేంద్రం తరలించి వైద్యుల సూచనల మేరకు వరంగల్ ఎంజీఎం తీసుకెళ్లగా, పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. ట్రాక్టర్ యాజమాని రమేష్ డ్రైవర్ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండు చేస్తూ రాస్తారోకో చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఏఎస్పీ చిత్తరంజన్ సంఘటన స్థలానికి చేరుకొని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు రాస్తారోకో విరమించారు. సీఐ బుద్దస్వామి, ఎస్సై చంద్రశేఖర్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రెబ్బెన, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా ఇంటర్మిడియేట్ విద్యాధికారిణి కళ్యాణి అన్నారు. రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మాదకద్రవ్యాలతో యువత చెడిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. వీటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అతియా ఖానం పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

ఎస్టీపీపీని అత్యుత్తమ ప్లాంట్‌గా నిలబెట్టాలి


వివరాలు తెలుసుకుంటున్న డైరెక్టర్ పా గౌతమ్‌పొట్రు

జైపూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణి నిర్వహిస్తున్న సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను దేశంలోనే అత్యుత్తమ ప్లాంట్‌గా నిలబెట్టాలని సింగరేణి డైరెక్టర్ పా గౌతమ్ పొట్రు పేర్కొన్నారు. బుధవారం జైపూర్‌లోని సింగరేణి థర్మల్‌పవర్‌ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఈడీ చిరంజీవి డైరెక్టర్‌కు ప్లాంట్ పనితీరును, కంట్రోల్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, బాయిలర్, అనలైటికల్ ల్యాబ్, టర్బైన్ పనితీరును వివరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మూడో ప్లాంట్ నిర్మించబోయే ప్రాంతాన్ని సందర్శించి ఫ్లోటింగ్ సోలార్, గ్రౌండ్ సోలార్ ప్లాంట్‌లను సందర్శించి వాటి పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్లాంటు పనితీరు, సింగరేణి ఒప్పంద కార్మికుల వివరాలు, సంక్షేమం, సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్లాంట్ నిర్వహణ బాగుందని, ఇటీవల వచ్చిన అవార్డుల పట్ల అభినందించారు. ముున్ముందు కూడా ప్లాంటు ఉత్పత్తి, ఉత్పాదకతను ఇలాగే కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అధికారులు డైరెక్టర్ పాను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు నర్సింహారావు, జేఎన్ సింగ్, సముద్రాల శ్రీనివాస్, మురళీధర్,మదన్‌మోహన్, శ్రీనివాస్, అజాజుల్లాఖాన్, చంద్రమణి, కిరణ్‌బాబు పాల్గొన్నారు.

సింగరేణిలో సమ్మె సక్సెస్


శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు

శ్రీరాంపూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి అమలు చేయాలని ప్రయత్నిస్తోందని బుధవారం దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మె సింగరేణిలో సక్సెస్ అయింది. కార్మికులుగనులను స్వచ్ఛందంగా మూసివేశారు. కార్మికులు విధులకు హాజరు కాలేదు. కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ఆందోళనలు చేపట్టారు. శ్రీరాంపూర్‌లోని గనుల్లో కార్మికులు విధులకు హాజరు కాలేదు. ఉదయం షిఫ్ట్ నడవకపోవడంతో ఏరియాలో మొత్తం 6,041 మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, రూ.2.59 కోట్ల నష్టం జరిగింది. అనంతరం ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద మహా ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి. సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి, సురేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హెచ్ఎంఎస్, ఐఎఫ్‌టీయూ, సింగరేణి ఉద్యోగుల సంఘం, ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సీసీసీ కార్నర్ వద్ద ధర్నా చేపట్టారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో షిర్కే సెంటర్‌లోని వేంకటేశ్వర టెంపుల్ నుంచి జీటీ హాస్టల్ వరకు రాలీ నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి. శ్రీనివాస్, టీఎస్‌యూఎస్ రాష్ట్ర నాయకుడు సమ్ము రాజయ్య, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేకల పోషమల్లు మాట్లాడారు.

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో సమ్మె విజయవం తమైంది. కార్మికులు గనుల వైపు కూడా వెళ్లలేదు. విధులకు హాజరయ్యే కార్మికులకు ఎక్కడ ఆటంకం కల్పిస్తారోనని గనుల వద్ద మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్‌ఐ రాజశేఖర్‌లు పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. కేకే 5 గని, కేకే ఓసీపీ, కాసిపేట 1, 2 గనులు, శాంతిఖని, ఏరియా స్టోర్, వర్క్‌షాపు, సివిల్ డిపార్టుమెంట్, సీహెచ్‌పీల్లో విధులకు కార్మికులు హాజరు కాలేదు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి భీమనాధుని సుదర్శన్‌లు మాట్లాడుతూ కేంద్రం వెంటనే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో పాల్గొన్నా రు. సీఐటీయూ ఆధ్వర్యంలో మందమర్రిలోని జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహిం చారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాజలింగు, రవి, రమేష్, నర్సయ్య, ఐలయ్య, పోశం, ప్రసాద్ పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మె కాసిపేట మం డలంలో సక్సెస్ అయింది. సింగరే ణి జేఏసీ పిలుపు మేరకు కాసిపేట 1, 2గనుల్లో బొగ్గుబావిలు బోయిపో యాయి. ప్రధానికి కార్మికుల సమస్యలపై కను విప్పు కలుగాలని కోరుతూ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్, టీబీజీకేఎస్ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.


మందమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు


శ్రీరాంపూర్ ఓసీపీలో నిలిచిపోయిన డంపర్లు


కాసిపేటలో బోసిపోతున్న బొగ్గు బావి

చేతులు తడిపితేనే..

(5వ పేజీ తరువాయి)

దీనికి నిదర్శనం. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏసీబీ అధికారులు అవకాశం చూసుకొని మెరుపుదాడులకు పాల్పడుతున్నారు.

ఏసీబీకి చిక్కిన అవినీతి పరులు...

గత నెలలో మంచిర్యాల తహసీల్దార్ కార్యాలయంలో ఓ మహిళ అధికారితోపాటు సర్వేయర్ అవినీతికి పాల్పడగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కేసు నమోదు చేశారు. ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలోని సెక్షన్ అకౌంట్ ఆఫీసర్, కంప్యూటర్ ఆపరేటర్‌లు కలిసి ఓ కాంట్రాక్టర్ వద్ద రూ. 15వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఉట్నూరు మండలం శ్యాంపూర్ పశువైద్యాధికారి రాథోడ్ రమేశ్‌ను జనవరి 29న ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కిందిస్థాయి ఉద్యోగికి ఎల్‌పీసీ ఇచ్చేందుకు రూ. 15వేలు లంచం తీసుకుంటూ అధికారి పట్టుబడ్డాడు. గత నెల 24న కడెంలో రెవెన్యూ సర్వేయర్ ఒకరు రైతు పట్టామార్పిడి కోసం రూ. 7వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఈ నెల 4న మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలో ఏసీబీ అధికారులు రైడ్ చేశారు. ఆ దాడుల్లో మండల డిప్యూటి తహసీల్దార్ రూ.10వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరిగతిన నిర్మించుకోవాలి

బెల్లంపల్లి, జూలై9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కేటాయించిన ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన నిర్మించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమేశ్ అన్నారు. బుధవారం పట్టణంలోని 13వ వార్డులో మాజీ కౌన్సిలర్ బండి ప్రభాకర్ యాదవ్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. కమిషనర్ లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకుంటే ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుందన్నారు. అనంతరం గాంధీనగర్‌లోని రూ. 50లక్షల నిధులతో నిర్మాణం పూర్తయిన డ్రైనేజీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అర్హులకే కేటాయించాలి

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని పట్టణంలో ఇళ్లు నిర్మించిన వారికి పట్టాలు అందజేయాలని కోరుతూ బుధవారం ఆర్డీవో హరికృష్ణకు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో ఎన్నో ఏళ్లుగా నిర్మించుకొని నివాసం ఉంటున్నవారికి ప్రభుత్వం ఇండ్ల పట్టాలు మంజూరుచేయకపోవడం సరైందికాదన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, పట్టణ అధ్యక్షురాలు కళ్యాణీ, నాయకులు అరవింద్, శ్రీనివాస్, రాజయ్య, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని వినతి

కోటపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం అశోక్‌ను సస్పెండ్ చేయాలని బుధవారం డీటీడీవో జనార్ధన్‌కు ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు, లంబాడా ఐక్యవేదిక సంఘం నాయకులు వినతి పత్రాలు అందించారు. విద్యార్థినుల శరీరాలపై చేతులతో తాకుతూ వారిని మానసికంగా శారీరకంగా హింసకు గురి చేస్తున్న హెచ్‌ఎంపై కఠిన చర్యలు తీసుకుని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. పలువురు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

●కోటపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం అశోక్ వ్యవహారంపై ఐటీడీఏ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్, సంఘం నాయకులు బండి రమేష్‌లు తెలిపారు. అశోక్ అనుచిత వ్యవహారంపై విద్యార్థినీలు వారం రోజుల క్రితమే తమకు తెలుపగా దీనిపై ఐటీడీఏ పీవో, ఏపీవో, డీటీడీవో, ఏటీడీవోలకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించాలి

నెన్నెల, జులై 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీఈవో యాదయ్య అన్నారు. బుధవారం ఆయన మండలంలో పర్యటించారు. రాష్ట్ర స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో గెలుపొందిన నెన్నెల కస్తూర్బా పాఠశాల విద్యార్థులను అభినందించారు. అనంతరం గొళ్లపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మైలారంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆయన వెంట ఎంఈవో చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

మందమర్రిటౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాష్ట్రీయ రహదారి అందుగులపేట రోడ్డుపై మంగళవారం రాత్రి ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో తీవ్ర గాయపడిన తాండూర్ మండలం రేచినికి చెందిన గోమాస తిరుపతి (29) బుధవారం ఉదయం మృతిచెందాడని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తిరుపతి మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



రుచికి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం

కేజీబీవీల్లో కొత్త మెనూ..

- పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు
- విద్యార్థినులకు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు
- పెరిగిన మెస్ చార్జీలు.. విద్యార్థినుల హర్షం

జైపూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నిరుపేద బాలికలు మధ్యలో చదువు ఆపివేయకుండా వారిని అక్కున చేర్చుకుని కేజీబీవీలు వసతితో కూడిన నాణ్యమైన విద్యనందిస్తున్నాయి. కేజీబీవీల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. కేజీబీవీ విద్యార్థినులు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నట్లు ఇటీవల చేపట్టిన సర్వేలో తేలింది.

దీంతో కేజీబీవీ బాలికల పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న బాలికలకు పౌష్టికాహారం అందించి వారిని అనారోగ్య సమస్యల నుంచి దూరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గతంలో ఉన్న మెనూలో పలు మార్పులు చేసింది. 2025-26 విద్యా సంవత్సరంలో నూతన మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందించనున్నారు.

పెరిగిన మెస్ చార్జీలు...

గతంలో 6-10వ తరగతి, ఇంటర్ విద్యార్థినులకు ఒకే విధంగా నెలకు రూ. 1225 ప్రభుత్వం అందించేది. కానీ నేడు నూతన మెనూ ప్రకారం 6 నుంచి 7వ తరగతి విద్యా ర్థినులకు నెలకు రూ. 1330, 8 తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థినులకు నెలకు రూ. 1540, ఇంటర్ విద్యార్థినులకు నెలకు రూ. 2100 అందించనున్నారు.

నూతన మెనూ ఇదే...

ఉదయం టమాట కిచిడీ, సాంబారు, బూస్ట్, పూరీ, రాగిజావ, ఉప్మా, పులిహోర, వడ, బోండా, చపాతి, జీర రైస్‌తో పాటు రోజుకు ఒక్కో రకమైన పండ్లు అందించాలి. ఇందులో అరటిపండు, జామ, వాటర్ మిలన్, బొప్పాయి. సపోట వంటి పండ్లు అందించాలి.

మధ్యాహ్నం : టమాట పప్పుతో కూడిన అన్నం, నెయ్యి, రసం, పెరుగు, ఉడకబెట్టిన గుడ్డు, చికెన్ అందించాలి.

సాయంత్రం : ఉడకబెట్టిన శనగలు, కోడిగుడ్డు, బజ్జీ, బెల్లం పల్లిలు, అల్లం చాయ్, మిల్లెట్ బిస్కెట్లు, పకోడి ఇవ్వాలి. రాత్రి వివిధ రకాల కూరలతో తయారు చేసిన అన్నం, సాంబారు, మజ్జిగ అందించాలి. నెలలో రెండు సార్లు మటన్, ఐదు సార్లు గుడ్లు, ప్రతి రోజు నెయ్యి అందించాలి.

సంతోషంగా ఉంది:

యు.చందనగౌరి, ఇంటర్, కేజీబీవీ



కేజీబీవీలోని విద్యార్థినుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం నూతన మెను అమలు చేయడం సంతోషంగా ఉంది. మెస్ ఛార్జీలు కూడా పెంచడంతో మాకు ఎంతో ఉపశమనం కలుగుతుంది.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

: కె. సృజన, పదవ తరగతి, కేజీబీవీ



గతానికి భిన్నంగా తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం సీఎం రేవంత్‌రెడ్డి నూతన మెను అమలు చేయడం ఆనందంగా ఉంది. ఇందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం. మంచి పౌష్టికాహారం అందించడంతో చదువుపై దృష్టి పెడుతున్నాం. నూతన మెను కూడా చాలా బాగుంది.

నూతన మెనూ ప్రకారమే..

: ఫణిబాల, కేజీబీవీ ఎస్‌వో, జైపూర్



ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి నూతన మెను అమలు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. నూతన మెను పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. తాజా కూరగాయాలతో విద్యార్థినులకు పౌష్టికాహారం తయారు చేసి అందిస్తున్నాం.

ఎంపీవో ఆకస్మిక తనిఖీ

తాండూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్వారకపూర్ పంచాయతీని మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్ ఆకస్మికంగా నతిఖీ చేశారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించి కార్యదర్శి కార్తీక్‌కు సూచించారు.

ఎంఈవో బాధ్యతలు స్వీకరణ

నస్పూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ మండల విద్యాధికారిగా పద్మజా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సీతారాంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా పని చేస్తున్న పద్మజా ఎంఈవోగా అదనపు బాధ్యతలను చేపట్టారు.

వైద్య శిబిరానికి స్పందన

మందమర్రిటౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ఆవరణలో బుధవారం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు రమేష్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలు రకాల పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విష్ణుతేజ, వైద్య సిబ్బంది సరిత, మధుబాబు, లత, శ్రీలత, కళావతి, కుమార్, సుశీల, సంధ్యారాణి, మధు, శ్రీధర్, లక్ష్మీ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

రామకృష్ణాపూర్, జూలై9 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీ డలు అవసరమని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. బుధవారం రామక్రిష్ణపూర్ ఠాగూర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి బాలికల జూనియర్ ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. నేటితరం విద్యార్థులు చదువుకు అంకితమై మానసికంగా ఇబ్బంది పడుతున్నారని క్రీడలు దేహదారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలుగజేస్తాయని అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక స్పోర్ట్స్ కోటా ఉంటుందని ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాల్లో క్రీడలు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. అనంతరం క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. జిల్లా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రఘునాథ్ రెడ్డి అధ్యక్షతన మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ క్రీడాపోటీలకు ఆయా జిల్లాలకు చెందిన క్రీడాకారులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, పట్టణ ఎస్ఐ రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, పట్టణ నాయకులు సాగర్ రెడ్డి, పనస రాజు, పీఈటీలు పాల్గొన్నారు.



విద్యార్థులతో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

గురుపౌర్ణమికి ఆలయం ముస్తాబు

దండేపల్లి జూలై 9 (ఆంధ్రజ్యోతి): గూడెం శ్రీషిర్డీసాయి బాబా దేవాలయంలో శ్రీదత్తసాయి గురు పీఠం సేవట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం గురుపూర్ణిమ సందర్భంగా సాయినాథ్ ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబు అయింది. ఆలయంలో గురుపౌర్ణిమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేయడంలో ఆలయ కమిటి నిర్వహకులు నిమగ్నమవుతున్నారు. గురు పౌర్ణమి సందర్భంగా ఆలయంలో కాగడ హారతి, నిత్యాపూజాభిషేకం, దత్తాత్రేయ హోమము, పుష్పభిషేకం, సాయి మహాహారతి. పల్లకిసేవ, సంధ్యాహారతితో పాటు అన్నదానం కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు శ్రీదత్తసాయి గురుపీఠం సేవట్రస్ట్ వ్యవస్థాపకులు నిర్వాహక కమిటీ ఛైర్మన్ శ్రీమాన్ చక్రవర్తుల పురుషోత్తమ చార్యులు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.

సంక్షిప్త సమాచారం

జైపూర్ : మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలోని దారి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ వనజారెడ్డికి గ్రామ రైతులు వినతి పత్రం అందించారు. రైతులు మాట్లాడుతూ వెంకట్రావుపల్లి, దుబ్బపల్లి గ్రామానికి చెందిన సుమారు 80 మందకి పైగా రైతులకు వెంకట్రావుపల్లి గ్రామంలో ఉన్న విశ్వనాధ చెరువు కింద సాగు భూములకు వెళ్లడానికి ఈ దారిని దుర్గం భీమలింగు తనకు పట్టా భూమి ఉందని కంచె వేశాడన్నారు. వెంటనే దీనిపై విచారణ చేసి దారి సమస్యను పరిష్కరించాలని న్యాయం చేయాలని విన్నవించారు.

రామకృష్ణాపూర్: క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో డబుల్ బెడ్ రూం ఇండ్లను బుధవారం రెవెన్యూ అధికారులు లాటరీ పద్ధతి ద్వారా కేటాయించారు. మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్, మందమర్రి తహసీల్దార్ సతీష్ కుమార్‌లు హాజరై లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడారు. 286 ఇళ్లకు గాను 230 ఇళ్లను కేటాయించినట్లు పూర్తి పారదర్శకంగా కేటాయించామన్నారు. 13 మంది దివ్యాంగులకు మొదట పత్రాలను అందజేశారు. అలర్ట్ మెంట్ పత్రాలను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ గాదె రాజు, అధికారులు పాల్గొన్నారు.

నెన్నెల: ఈ నెల 10 నుంచి 16 వరకు ఇందిర మహిళా శక్తి సంబరాలు ఘనంగా నిర్వహిచుకోవాలని ఏపీఎం విజయలక్ష్మి కోరారు. మండలంలోని గ్రామైక్య సంఘాలతో బుధవారం సమావేశమయ్యారు.

నెన్నెల : నెన్నెల తహసీల్దార్‌గా ముద్దమల్ల జ్యోతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేసిన ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు.

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులపై చర్యలు తీసుకోవాలని బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో మంచిర్యాల మెడికల్ కౌన్సిల్ చైర్మన్ ఎగ్గన శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు.

చెన్నూరు : పట్టణంలోని మడేలేశ్వరస్వామి ఆలయంలో బుధవారం బోనాల పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రజకుల ఆరాధ్యదైవమైన మడేలేశ్వరస్వామికి ఆ కులస్తులు బోనాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

మందమర్రిరూరల్ : మండలంలోని సారంగపల్లి గ్రామంలో వరి నారు మడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ఏడీఏ బానోత్ ప్రసాద్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు ఎక్కువగా వచ్చినప్పుడు నీరు నిల్వ ఉండి వరినారు కుళ్లి పోకుండా కాలువలు తీసి నీటిని బయటకు పంపించాలన్నారు.

మందమర్రిరూరల్ : మామి డిగట్టు గ్రామానికి చెందిన అమృతమ్మ ఇటీవల మృతిచెందగా బుధవారం కుటుంబీకులు ఆమె సంతాప సభ నిర్వహించారు. అమృతమ్మ చిత్రపటానికి కవి, రచయిత అల్లం రాజయ్య, బీజేపీ క్రమశిక్షణ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గోనె హన్మంతరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కళ్లను ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆసుపత్రికి, బాడీని మెడికల్ కాలేజీకి ఇవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు.

కార్మికవర్గాన్ని పట్టించుకోని కేంద్రం

జిల్లా వ్యాప్తంగా సార్వత్రిక సమ్మె సక్సెస్



చెన్నూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్మికులు

చెన్నూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కార్మిక వర్గాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి పేర్కొన్నారు. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, కార్మికులతో కలిసి చెన్నూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రధాని మోదీ 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికులకు అన్యాయం చేస్తుందన్నారు. కార్పోరేట్‌లకు కొమ్ము కాస్తున్న మోదీ కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. దీంతో కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోతుందన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తే ఊరుకోమన్నారు. మోదీ బాటలోనే సీఎం రేవంత్‌రెడ్డి నడుస్తున్నారని, 10 గంటల జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎర్మ పున్నం, రాములు, రవి, శారద, పద్మ, ప్రవీణ, సరోజ, లక్ష్మీ పాల్గొన్నారు.

తాండూర్ : దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం తాండూర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి ఐబీ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ చేపట్టిన సమ్మెకు మద్దతుగా కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. సింగరేణి సివిల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు సింగరేణి మున్సిపల్ కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించి నాలుగు లేబర్‌కోడ్‌ల ప్రతులను దహనం చేసి మాట్లాడారు. నాయకులు చాంద్‌పాషా, మణిరాం సింగ్, రాజన్న, మహేందర్, శంకర్‌లు పాల్గొన్నారు.

నెన్నెల : కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం చేపట్టిన దేశవ్యాప్త సమ్మె మండలంలో విజయవంతమైంది. ప్రజా, కార్మిక సంఘాలు ఏకమై సమ్మెను విజయవంతం చేశాయని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి అన్నారు. టీడీపీ నాయకులు శంకర్, ఐఎఫ్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

జన్నారం: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన సమ్మె విజయవంతం చేయడంలో భాగంగా సీపీఐఎం, సీఐటీయు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీపీఐఎం, సీఐటీయు నాయకులు బుచ్చయ్య, లింగన్నలు సీఐటీయు, సీపీఐఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

మంచిర్యాల కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థల ప్రైవే టీకరణ మానుకోవాలని విద్యుత్ మంచిర్యాల సర్కిల్ జేఏసీ చైర్మన్ సత్తిరెడ్డి, కన్వీనర్ రమేష్‌లు పేర్కొన్నారు. కేంద్రం విధానాలకు నిరసనగా బుధవారం మద్దతు తెలిపారు. మంచిర్యాల విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో వర్క్ బాయ్‌కాట్ కార్యక్రమాన్ని భోజన విరామ సమయంలో నిర్వహించారు. కేంద్రం అవలంభిస్తున్న విధానాల్లో భాగంగా ఉత్తర ప్రదేశ్‌లో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అక్కడి ఉద్యోగులు కుటుంబ సమేతంగా చేస్తున్న నిరసన కార్యక్రమాలకు మద్దతుగా నిరసన నిర్వహించామన్నారు. కో కన్వీనర్ రాజశేఖర్, సూపరింటెండెంట్ ఇంజనీరింగ్ ఉత్తమ్, నాయకులు కొండయ్య, వెంకటేశ్వర్లు, శరత్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు చిన్నాభిన్నం

దండేపల్లి జూలై 9(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను చిన్నాభిన్నం చేసుకోకుండా వాటికి దూరంగా ఉండాలని ఎస్సై తాహసీనోద్దీన్ అన్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో దండేపల్లి బస్టాండ్ వద్ద బుధ వారం స్థానిక ప్రజలు, యువతకు రోడ్డు భద్రత, డ్రగ్స్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరం ఉంటూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. గంజాయి, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలను వినియోగిస్తే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు.

మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం అందరు కృషి చేయాలన్నారు. అనంతరం పోలీసులు పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బాధితుడికి నష్టపరిహారం అందజేత

కాసిపేట, జూలై9 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి అటవీరేంజ్ పరిధిలోని ముత్యంపల్లి అటవీసెక్షన్‌లో సోమవారం పులిదాడిలో ఆవు మృతి చెందింది. వెంకటాపూర్‌కు చెందిన బుద్దే రాజలింగు ఆవు యజమానికి బుధవారం బెల్లంపల్లి ఎఫ్ఆర్‌వో పూర్ణ చందర్ ముత్యంపల్లి ఎఫ్‌డీఆర్‌వో ప్రవీణ్ నాయక్ రూ.20వేల నష్టపరిహారం అందజేశారు. ఈసందర్భంగా ఎఫ్ఆర్‌వో పూర్ణ చందర్ మాట్లాడుతూ పులిదాడి జరిగిన 24 గంటల్లోనే బాధిత యజమానికి నష్టపరిహారం అందజేశారు. వన్య ప్రాణులకు హాని కలిగించవద్దన్నారు.

గురుకుల పాఠశాలలో ఫోన్ మిత్ర

బెల్లంపల్లి, జూలై9 (ఆంధ్రజ్యోతి): కాసిపేట గురుకుల పాఠశాలలో బుధవారం ఫోన్ మిత్ర కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అమ్మతో ఒక మాట అనే ఉద్దేశంతో ఫోన్ మిత్ర ద్వారా విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులతో ఫోన్ మాట్లాడడం వల్ల మానసికంగా కుదుటపడుతారన్నారు. ఫోన్ మిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

గోరింటాకు సంబరాలు

లక్సెట్టిపేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాఘవేంద్ర కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో బుధవారం ఆశాడమాసం గోరింటాకు వేడుకలను నిర్వహించారు. విద్యార్థినులు ఉపాధ్యాయులు గోరింటాకు పెట్టి సంబరాలు జరుపుకున్నారు. ప్రిన్సిపల్ శిల్ప మాట్లాడుతూ గోరింటాకు విశిష్టతను వివరించారు. కరస్పాండెంట్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ : సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం గోరింటాకు వేడుక నిర్వహించారు. నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో నిర్వహించిన వేడుకకు సేవా సమితి అధ్యక్షురాలు ఎం. ఉమారాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమితి ద్వారా అనేక మంది మహిళలకు ఉపాధి శిక్షణ ఇస్తూ ఉపాధి చూపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పీవో కాంతారావు, సేవా సమితి కార్యదర్శి కొట్టె జ్యోతి, సభ్యులు, శిక్షకులు పాల్గొన్నారు.






లక్సెట్టిపేటలో విద్యార్థినులు, శ్రీరాంపూర్‌లో గోరింటాకు ప్రదర్శిస్తున్న మహిళలు

పంచాయతీ అధికారుల సమావేశం

హాజీపూర్,జూలై9(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు అధ్యక్షతన బుధవారం రీజినల్ పంచాయతీ అధికారులు, మండల పంచాయతీ అధికారుల సమావేశం నిర్వహించారు. వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లో లేఅవుట్ అనుమతులు, గృహ నిర్మాణ అనుమతులు, మ్యూటేషన్, ట్రేడ్ లైసెన్స్‌కు సంబంధించిన దరఖాస్తులు ప రిష్కరించాలని తెలిపారు. . డీఎల్‌పీఓలు, ఎంపీవోలు, కార్యా లయ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

జన్నారం,జూలై9(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్సీ కవిత నివాసంలో తెలంగాణ మాదిగ హక్కుల దండోర రాష్ట్ర అధ్యక్షులు మొండికత్తి లింగన్న ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు పొనుకూరి రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్లు కల్పించి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై తలపెట్టిన ఈనెల 17న రైలు రోకోను మద్దతు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



రుచికి రుచి..ఆరోగ్యానికి ఆరోగ్యం
● కేజీబీవీల్లో కొత్త మెనూ
● పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశం
● విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు
7

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

● డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ



బోనమెత్తుకున్న డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు అని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పేర్కొన్నారు. బుధవారం మంచిర్యాలలోని హమాలీవాడలోని కట్ట పోచమ్మ బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. హమాలీవాడ హనుమాన్, సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం హైద్రాబాద్ నుంచి వచ్చిన జోగిని నిషా క్రాంతి ఆధ్వర్యంలో బోనాల జాతరను ప్రారంభించారు. నల్ల కోటమ్మ-లక్ష్మయ్య ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాతరలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నల్ల శంకర్ నివాసంలో జోగిని నిషా క్రాంతి బంగారు బోనంను అందంగా అలంకరించి పూజలు చేసి బంగారు బోనం తీసుకుని డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలతో, నిషాక్రాంతి పూనకాలతో నృత్యాలు చేస్తూ ఆలయం వరకు చేరుకున్నారు. ఆలయంలో అమ్మవారికి బంగారు బోనం సమర్పించగా స్థానిక మహిళలను తీసుకువచ్చిన బోనాలను సైతం అమ్మవారికి సమర్పించారు. ఈ జాతరకు అతిథిగా హాజరైన డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నల్ల శంకర్ నివాసంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా మడేలయ్య బోనాల జాతర

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని అరుణక్కనగర్‌లో రజకుల కులదైవమైన మడేలయ్య స్వామి బోనాల జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్, ప్రధాన కార్యదర్శి పుట్టపాక తిరుపతి, గ్రామ అధ్యక్షుడు పున్న బక్కయ్య, కార్యదర్శి అన్నారం మహేష్, రజక కులస్తులు పాల్గొన్నారు.




బోనాల జాతరలో పోతరాజుల నృత్యాలు

చేతులు తడిపితేనే..

అవినీతికి నిలయాలుగా ప్రభుత్వ కార్యాలయాలు

● లంచం ఇవ్వనిదే కదలని ఫైళ్లు
● విధిలేని పరిస్థితుల్లో ఏసీబీని ఆశ్రయిస్తున్న బాధితులు
● వరుస ఫిర్యాదులతో దూకుడు పెంచిన అధికారులు



మంచిర్యాల, జూలై9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏసీబీ అధికారుల వరుస దాడులు కలకలం సృష్టిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని రూపుమాపేందుకు ఏసీబీ అధికారులు ఇటీవల దూకుడు పెంచారు. అయినా నిత్యం ఏదో ఒక చోట అవినీతి అధికారులు పట్టుపడుతున్నా ఇతర ఉద్యోగుల్లో మార్పులు రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల హోదాను బట్టి నెల నెల లక్షల్లో వేతనాలు అందుకుంటున్నప్పటికీ లంచాల కోసం అడ్డదారులు తొక్కడం ఆనవాయితీగా మారింది. ప్రతిపనికి ఓ రేటు నిర్ణయించి మరీ లంచాలు పుచ్చుకుంటున్నారు. ప్రధానంగా రెవెన్యూ మున్సిపల్ వైద్యారోగ్యశాఖ రిజిస్ట్రేషన్లు, సర్వే అండ్ భూ రికార్డులు పంచాయతీరాజ్ శాఖల్లో ఎంతోకొంత ముట్టచెప్పంది పనులు జరిగే పరిస్థితి లేదు. దీంతో సహనం కోల్పోతున్న బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఏసీబీ దాడులు ముమ్మరం కాగా అవినీతి అధికారుల భరతం పడుతున్నారు.

లంచం ఇస్తేనే పనుల్లో కదలిక...

వివిధ ప్రభుత్వ శాఖల్లో అధికారులు లంచం ఇస్తేనే సంబంధిత ఫైళ్లను కదలిస్తున్నారు. లంచం నిరాకరించిన పక్షంలో ఏదోఒక సాకు చూపుతూ ఫైళ్లను వెనక్కి పంపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్న ప్రజలు నెలల తరబడి తిరిగిన చక్కదిద్దడం లేదు. ముఖ్యంగా ఆయాశాఖల కిందిస్థాయి అధికారులతో అంటకాగుతున్న జిల్లాశాఖల అధిపతులు లంచాలను ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంకా కొన్నిచోట్ల నేరుగా కాకుండా కాంట్రాక్టు ఉద్యోగులు, ఏజెంట్ల ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

దాడులకు వెరవని అధికారులు...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏసీబీ అధికారులు వరుస దాడులు జరుపుతూ లంచావతారాలను పట్టుకున్నప్పటికీ వివిధశాఖల ఉద్యోగుల్లో ఎలాంటి బెదురులేకపోవడం గమనార్హం. ఓవైపు దాడులు జరుగుతుండగా మరోవైపు అవే కార్యాలయాల్లో లంచాలు తీసుకుంటుండడం గమనర్హం. మరోవైపు ఏసీబీ అధికారుల టార్గెట్‌లో ఉన్న ఉద్యోగులు సైతం ఎలాంటి జంకులేకుండా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బాగా ఆదాయ వనరులు ఉన్న శాఖల్లో ఏసీబీ రైట్స్‌కు కూడా వెరవడం లేదని తెలుస్తోంది. ముఖ్యంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, రెవెన్యూ డిపార్టమెంట్, పంచాయతీరాజ్‌శాఖల్లో ఈ వ్యవహారం మరింతగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ సరే లక్షల్లో లంచాలు తీసుకనేందుకు కూడ వెనుకాడడం లేదని ప్రచారం జరుగుతోంది.

దూకుడు పెంచిన ఏసీబీ...

ఇటీవలి కాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ వ్యాప్తంగా ఏసీబీ అధికారులు దూకుడు పెంచారు. వరుస దాడులతో లంచగొండి అధికారుల భరతం పడుతున్నారు. మూడు నెలల కాలంలో ఆరుచోట్ల దాడులు జరుగడమే.. -మిగతా 7లో

ఎవరికీ లంచం ఇవ్వవద్దు...



ప్రభుత్వ ఉద్యోగులు ఎవరికి లంచం ఇవ్వవాల్సిన అవ సరం లేదు. ఎవరైన లంచం డిమాండ్ చేసే ఏసీబీ అధికా రులకు సమాచారం ఇవ్వాలి. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఏసీబీ టోల్‌ఫ్రీనంబర్ 1064 బోర్డులను ఏర్పాటు చేసాము. అలాగే 9154388963 నంబర్‌లో ఏసీబీ డీఎస్పీని కూడ సం ప్రదించవచ్చు. బాధితులు నిర్భయంగా ఏసీబీని ఆశ్రయిస్తే న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటాం. బాధి తుల వివరాలను గోప్యంగా ఉంచుతాం.

- జి. మధు, ఏసీబీ డీఎస్పీ ఆదిలాబాద్

చెన్నూరులో ఇసుక బజార్‌ను ప్రారంభిస్తాం



మాట్లాడుతున్న మైనింగ్ ఏడీ జగన్‌మోహన్‌రెడ్డి

చెన్నూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజల అవసరాల కోసం త్వరలో చెన్నూరు పట్టణంలోనే గోదావరి ఇసుక బజార్‌ను ఏర్పాటు చేస్తామని మైనింగ్‌శాఖ ఏడీ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బతుకమ్మ వాగు ఇసుక నాణ్యత లేకపోవడంతో గోదా వరి ఇసుకకు డిమాండ్ ఉందన్నారు. ప్రజల డిమాండ్ మేరకు నిర్మాణం జరుగుతున్న వంద పడకల ఆసుపత్రి భవనం వెనకాల ప్రభుత్వ స్థలంలో ఇసుక బజార్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణంలో ఇసుక స్టాక్‌యార్డు ఏర్పాటుతో ప్రజలకు రవాణా ఖర్చులు తగ్గుతాయన్నారు. టీజీఎండీసీ పీవో శ్రీకాంత్ మాట్లాడుతూ హైద్రాబాద్ తరహాలో చెన్నూరులో సాండ్ బజార్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎ ర్రాయిపేట,కొల్లూరు గోదావరి నదుల నుంచి ఇసుకను తీసుకుని వచ్చి స్టా క్ యార్డులో నిల్వ ఉంచుతామన్నారు. దీంతో ప్రజలకు ఇసుక కష్టాలు తీరుతాయని తెలిపారు.

తపస్ ఉద్యోగుల సభ్యత్వం



ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేస్తున్న సంఘ సభ్యులు

లక్షెట్టిపేట, జులై 9(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు తెలంగాణ ప్రాంత ఉద్యోగుల సంఘం (తపస్) ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంను చేపట్టారు. ఈకార్యక్రమానికి సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేష్ హాజరై ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగంలో పని చేస్తున్న ఉపాధ్యాయుల అన్ని రకాల పెండ్డింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ఉపాధ్యాయుల హక్కుల సాధనకై తపస్ ముందుండి పోరాటం చేస్తుందన్నారు. ఉద్యోగుల కోసం ప్రభుత్వం జమ చేయాల్సిన వాటాను గత 13నెలలుగా జమచేయడం వెంటనే జమ చేయాలని డిమాండ్ చేసారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి బగ్గని రవికుమార్, లక్షెట్టిపేట మండల అధ్యక్షురాలు బిల్ల రాజలక్ష్మి, సంఘం ఉపాధ్యాయులు ఆకుల కార్తిక్, కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కొనసాగించాలి



మంచిర్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు

మంచిర్యాలకలెక్టరేట్, జూలై9 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం 44 కార్మిక చట్టాలను కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోపాల్‌లు పేర్కొన్నారు. దేశ వ్యాప్త సమ్మెకు మద్దతుగా బుధవారం మంచిర్యాలలోని ఐబీ చౌరస్తా నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం కార్మికచట్టాలను కొనసాగించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడుతోందన్నారు. వెంటనే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, దేవరాజ్, లక్ష్మణ్, పోలు, మల్లేష్, చంద్రశేఖర్, సరస్వతి, రమ, సురేఖ, అరుణ, కుసుమ, ఆశయ్య, రంజిత్, ప్రకాష్, శ్రీనివాస్, పద్మ, కుమారి పాల్గొన్నారు.

●కేంద్రం కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని విద్యుత్ అధికారులు పేర్కొన్నారు. బుధవారం దేశవ్యాప్త సమ్మెకు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణ జరిగితే కార్మికులు ఇబ్బందులు పడతారన్నారు. కేంద్రం 44 చట్టాలను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో గులాబ్, రాజ్‌కుమార్, రాజేష్, కైసర్, లక్ష్మణ్, ప్రశాంత్, విలాస్, మనోహర్, సాయికుమార్, తేజ, ఆర్టిజన్‌లు, జేఎల్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై పోరాడే వ్యక్తికే గుర్తింపు

● ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



కేక్‌కట్ చేసి ఎమ్మెల్యేకు తినిపిస్తున్న కార్యకర్తలు

జన్నారం,జూలై9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాడుతూ వారి సమస్యలు పరిష్కరించే వారికి గుర్తింపు ఎప్పుడు ఉంటుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంత్రి సీతక్క జన్మదిన వేడుకల సందర్భంగా ఎఎంసీ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. మంత్రి సీతక్క పేద బడుగు బలహీనవర్గాల కోసం పోరాడి వారి నిజజీవితానికి దగ్గరగా ఉన్న వ్యక్తి అని అందుకే పేదప్రజల సమస్యలను సమస్యల పరిష్కరించడంలో ముందుంటారని సీతక్క నిత్యం ప్రజాహితం కోసం పోరాడే ఉక్కు మహిళ అని అన్నారు. ప్రజా పోరాటాలు చేసి నేడు ప్రభుత్వం మంత్రి హోదాలో ఉండడం కాంగ్రెస్ ప్రభుత్వం మహిళ అభ్యున్నతికి కట్టిన పట్టం అన్నారు. ఆమె బాటలో నేటి యువత నడువాలని పిలుపునిచ్చారు. మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఎఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కాంగ్రెస్ నాయకులు ఫసీయుల్లా, ముజాఫర్ అలీ, ఇంధయ్య, రియాజోద్దీన్, రజాక్, సుధాకర్ నాయక్,నందు నాయక్, కరుణాకర్, ముత్యం సతీష్‌లతో పాటు మండల నాయకులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

దండేపల్లి జూలై 9 (ఆంధ్ర జ్యోతి): ఓపెన్ స్కూల్ సొసైటి ఆధ్వర్యంలో 2025-26 విద్య సంవత్సరంగాను ఓపెన్‌టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకోసం అర్హులైన అభ్యసకులు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దండేపల్లి ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ నరేందుల శ్రీనివాస్, సహాయ కోఆర్డినేటర్ సంగర్స్ రాజేశ్వర్‌రావులు మంగళవారం ఓ ప్రకటలో తెలిపారు. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా జూలై 11వ తేదీలోపు అభ్యాసకులు ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశం పొందేందుకు మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 8309769067, 9866110308లో సంప్రదించాలన్నారు.

షీటీం మహిళలకు అండగా ఉంటుంది

● సీఐ నరేశ్‌కుమార్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నరేశ్ కుమార్

మంచిర్యాలక్రైం, జూలై9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి నులకు, మహిళలకు షీటీం అండగా ఉంటుందని మహిళ పోలీస్ స్టేషన్ సీఐ నరేశ్ అన్నారు. తెలంగాణ సాంఘీక సంక్షేమ గు రుకుల మహిళ డిగ్రీ కళాశాలలో బుదవారం షీటీంపై అవగాహన సదస్సును భరోసా సెంటర్, సఖీసెంటర్ సైబర్ నేరాలపై కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోకాని ఇతర ప్రాంతాల్లో గాని మహిళలపట్ల, బాలికలపట్ల ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రయాణ సమయంలో టీ షే ప్ యాప్‌ను ఉపయోగించాలన్నారు. సమాజంలో ఎక్కువగా తెలిసినవారితోనే ఎక్కువగా వేధింపులకు గురవుతున్నారని అలాంటి సమయంలో పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

క్రైం జరిగినప్పుడు 1930 ఫిర్యాదు సమాచారం అందించాలని ఇతర ఇబ్బందులు కలిగినప్పుడు వందకు డయల్ చేయాలని, మహిళల రక్షణ కోసం 6303923700 సమచారం అందిస్తే బాధితులకు అండగా ఉండి నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ హైమా, భరోసా సెంటర్, సఖీ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

'బుద్ధుడితో నా ప్రయాణం ' విజయవంతం చేయాలి

● ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలక్రైం, జూలై9 (ఆంధ్ర జ్యోతి): బుద్ధుడితో నా ప్రయాణం నాటక ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. బుధవారం ఆయన నివాసంలో నాటకప్రదర్శనకు సంబంధించి గోడ ప్రతులను విడుదలచే శారు. ఈనెల 11న సాయంత్రం 6గంటలకు ఎంకన్వెన్షన్‌హాల్‌లో బుద్ధ డితో నా ప్రయాణం అనే నాటికను అభ్యుదయ ఆర్ట్స్‌అకాడమి ఆధ్వర్యంలో ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈ ప్రదర్శనకు పిల్లలు పెద్దలు మేధావులు, దళితులు, బహుజనులు కులమతాలకు అతీతంగా అందరూ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో నిర్వహణ కమిటీ సభ్యులు తొగరి సుధాకర్, కూన రవి కుమార్, దాసరి వెంకట రమణ, దుర్గం రాజేశ్, గోడిశెల దశరథం, దేవి సత్యం, అశోక్ తేజ పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలక్రైం, జూలై9 (ఆంధ్ర జ్యోతి): నిరుద్యోగ యువత ఉద్యోగానికై వర్చుస్‌కన్వెన్స్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉద్యోగానికి ఇంటర్వ్యూకు హాజరుకావాలని కంపెనీ డైరెక్టర్ మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ పోస్టులకు బీటెక్, ఎంటెక్, బీఫార్మసీ, ఎంఎస్సీ, ఎంబీఏ, పూర్తిచేసిన అభ్యర్థులు ఈనెల11 నుంచి 13 వరకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు మంచిర్యాల పట్టణం జన్మభూమినగర్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. 18 ఖాళీలకు గాను ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకోసం 9059618407, 9059748407 సంప్రదించాలన్నారు.

ఆసుపత్రి ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి

● ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

లక్షెట్టిపేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాన్ని ఈనెల 13న ప్రారంభిస్తున్నామని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పిలుపునిచ్చారు. నూతన భవనం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రారంభోత్సవానికి పలువురు మంత్రులు హాజరుకానున్నట్లు తెలిపారు. విద్య వైద్యానికి మన మంచిర్యాల జిల్లా రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా ఉంటుందన్నారు. 2013లో ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రి భవనం శిథిలావస్థలో ఉంటే నూతన ఆసుప త్రి భవన నిర్మాణం కోసం ప్రతిపాధనలు పంపింది తానే అని మళ్లీ అది తన తన హయాంలోనే ప్రారంభించే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. సభకు సుమారు లక్షమంది పాల్గొంటారన్న అంచనా వేస్తున్నామన్నారు. రెబ్బన్‌పల్లి గ్రామంలో సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయ నున్నట్లు తెలిపారు. అనంతరం రెండు రోజులు మంత్రులు పలు అభివృద్ధి పనుల్లో పాల్గొంటారని తెలిపారు. ఇక్కడ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్‌చంద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండి, ఆరీఫ్, మం డల అధ్యక్షుడు రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, మాజీ ము న్సిపల్ ఫ్లోర్ లీడ ర్ నాగభూషనం, ఆర్టీఏ మెంబర్ శ్రీనివాస్, నాయ కులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేటకు ఎందులోనూ తక్కువ చేయను...

లక్షెట్టిపేట పట్టణానికి మంచి గుర్తింపు ఉందని ఎందులో చిన్న చూ పు చూసే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే అన్నారు. తన చిన్నతనం విద్యను అభ్యసించిన ఊరు లక్షెటిపేట అన్నారు. పట్టణ మున్సిపాలిటీలోని అం బేద్కర్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు వందఫీట్ల రోడ్డు చేపడ తామన్నారు. రానున్న రోజుల్లో లక్షెట్టిపేటలో ప్రైవేట్ కళాశాలలు ఉండ వని ప్రతీ ఒక్కరికి కార్పొరేట్ స్థాయి విద్య అందించడం కోసం ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు ఏర్పాటు చేసి ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చి దిద్దు తామన్నారు. లక్షెట్టిపేటకు రింగు రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు ఊ త్కూర్ చౌరస్తా నుంచి ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌కు వచ్చి సీఎస్ఐ మీ దుగా అంద్రబోర్‌కు వెళ్లే విధంగా రోడ్డు మార్గంకు సన్నాహాలు సిద్ధం చేస్తామన్నారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలి

లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్

లక్షెట్టిపేట, జులై 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుండే చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవ గాహన కలిగి ఉండాలని లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్ కసమల అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో బుధవారం న్యాయ సేవాదికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞనసదస్సులో ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ పట్టుదలతో చదువుకోవాలని ఒక లక్ష్యం ఎంచుకుని దాని సాధనకు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు ఏలాంటి సమస్య ఉన్న దాని పరిష్కారం కోసం ఒక చట్టం ఉంటుందన్నారు. ముఖ్యంగా కళాశాలల్లో ర్యాగింగ్ పట్ల దూరంగా ఉండాలని ర్యాగింగ్‌కు పాల్పడితే కలిగే నష్టం గురించి వివరించారు. అదే విధంగా పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, జనరల్ సెక్రటరీ ప్రదీప్‌కుమార్, సీనియర్ న్యాయవా దులు కారుకూరి సురేందర్, పద్మ, రాజేశ్వర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంతోష్ మహాత్మ, ఎఎస్సై సుధాకర్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.